సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం, 30, డిసెంబర్, 2023



సోమశిలలో 34.733 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం 34.733 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 34 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.65,120
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,848
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,023
నవర (8 గ్రాములు)	రూ.48,184

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.5 /22.0

శుక్రవారం వాతావరణంలో తేమ 74శాతం ఉంది. కనిష్ట ఉష్ణోగత్రలు నమోదయ్యాయి. శనివారం కూడా వాతావరణంలో పెద్దగా మార్పులు ఉండవు.

న్యూస్‌రీల్

డీసీసీబీ నూతన సీఈఓగా శ్రీనివాసరావు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) నూతన సీఈఓగా ఎస్ శ్రీనివాసరావును నియమిస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన జనవరి 1న బాధ్యతలు స్వీకరించనున్నారు. మూడేళ్ల పాటు డీసీసీబీ సీఈఓగా విధులు నిర్వహించనున్నారు.

ఎంపీడీఓ సస్పెన్షన్

నెల్లూరు(పొగతోట): సీతారామపురం మండల ఎంపీడీఓ ఎం రంగసుబ్బరాయుడును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎం హరినారాయణన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పందన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించడంతో ఎంపీడీఓను సస్పెండ్ చేసినట్లు సమాచారం.


ఈవీఎంల గోదాముల వద్ద పటిష్ట బందోబస్తు



ఈవీఎం బాక్సులను పరిశీలిస్తున్న కలెక్టర్

నెల్లూరురూరల్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని ఈవీఎంల గోదాముల వద్ద పటిష్ట బందోబస్తుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణ్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంల గోదాములను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరచి వీవీ ప్యాట్స్, ఈవీఎంలను పరిశీలించారు. కలెక్టర్ వెంట నెల్లూరు ఆర్డీఓ మలోల, అర్బన్ తహసీల్దార్ నిర్మలానందబాబా, ఎన్నికల డీటీ అశోక్ ఉన్నారు.

అభివృద్ధి దిశగా రాష్ట్రం





సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయకల్లం, సదస్సుకు హాజరైన విద్యార్థులు

- ప్రభుత్వ పాలనా విధానంలో విప్లవాత్మక మార్పులు
- నాడు-నేడుతో 45,975 పాఠశాలల్లో మౌలిక వసతులు
- పైసా చెల్లించకుండా విద్యాదీవెన, ఆరోగ్యశ్రీ అమలు
- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యసలహాదారు అజేయ కల్లం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట/బారకాసు/టౌన్): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో వేగంగా అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం పేర్కొన్నారు. ఓపెన్‌మైండ్స్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో 'ప్రభుత్వ పాలనా విధానంలో విప్లవాత్మక మార్పులు-ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి' అంశంపై నగరంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వైద్యం, విద్య, పరిపాలన, భూ సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు గతంలో ఏ ప్రభుత్వం చేపట్టలేదన్నారు. రాష్ట్రాభివృద్ధి దిశగా రూ.13 వేల కోట్లతో చిన్న, పెద్ద పరిశ్రమల ఏర్పాటుతో పదివేల మందికి ఉపాధి అవకాశాలు, రూ.11,753 కోట్లతో ఆరు ఇండ్రస్టియల్ పార్కుల అభివృద్ధి, రూ.2,272 కోట్ల విదేశీ పెట్టుబడులతో ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. సమాజం బాగుపడాలంటే మంచి ప్రణాళికలతో పథకాలు రూపకల్పన చేసి ప్రజలకు అందుతున్నాయా? లేదా? అని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

గ్రామస్థాయిలో సుపరిపాలన
-ఎస్ రామ్‌కుమార్‌రెడ్డి, చైర్మన్, బీసీడీఈ

గ్రామస్థాయి నుంచే ప్రజలకు సుపరిపాలన అందించేందుకు సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. గతంలో ఇంజినీరింగ్ విద్యకు ప్రభుత్వం కేవలం రూ.35 వేలు చెల్లిస్తే మిగిలిన ఫీజును విద్యార్థులే చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులపై భారం పడకుండా కళాశాల ఫీజు మొత్తాన్ని చెల్లిస్తోంది.

బడుగు, బలహీన వర్గాల కోసమే సంస్కరణలు
-రాజశేఖరరెడ్డి. ఓపెన్ మైండ్స్ అధ్యక్షుడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు అన్ని పేద బడుగు, బలహీన వర్గాల కోసమే. 2017లో తమ స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాం. అప్పట్నుంచి ప్రభుత్వ కార్యక్రమాలపై సదస్సులు నిర్వహిస్తూ వస్తున్నాం. ప్రభుత్వం ప్రజలకు అవసరమైన సౌకర్యాలను అందించడమే విప్లవాత్మక మార్పుగా తమ సంస్థ భావిస్తోంది. 2014లో ఏర్పాటైన టీడీపీ ప్రభుత్వం సీఎం చంద్రబాబు ప్రచార మాయలో పడి పాలనను పట్టించుకోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చి ఎంతో అభివృద్ధి చేసింది.

ఉన్నత విద్యకు బాటలు
- సుందరవల్లి, వీసీ, వీఎస్‌యూ

అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, తదితర పథకాల అమలు ద్వారా ఆర్థిక స్థోమత లేని విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రభుత్వం బాటలు వేస్తోంది. విద్యా విధానంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. నాలుగేళ్ల డిగ్రీ కోర్సుతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు సైతం అందుబాటులోకి తీసుకురావడం విద్యార్థుల పాలిట వరం.

భవిష్యత్‌కు భరోసా
-శివసంకేత్, రావూస్ విద్యాసంస్థల డైరెక్టర్

సీఎం వైఎస్ జగన్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. విద్యార్థుల కలల సాకారానికి విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజురీయంబర్స్‌మెంట్ పథకాలు ఎంతో దోహదపడ్డాయి.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



పేద పిల్లల ఉన్నత విద్యకు విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాలతో పాటు మహిళలకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18 వేలు అందజేస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తూ పరిపాలన సాగించడం సంతోషకరం

– పద్మప్రియ, డిగ్రీ విద్యార్థిని

వైఎస్ జగన్ చలువతోనే డిగ్రీ చదువుతున్నా



మాది పేద కుటుంబం. చదువంటే నాకు ఎంతో ఇష్టం. నా చదువు ఖర్చులను తల్లిదండ్రులు భరించలేని పరిస్థితి. ప్రస్తుతం నేను కార్పొరేట్ కళాశాలలో చదుతున్నానంటే అందుకు కారణం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువే. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో నాలాంటి పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

– శిరీష, డిగ్రీ విద్యార్థిని



విద్యాదీవెన నమూనా చెక్కును అందజేస్తున్న జేసీ కూర్మనాథ్

ఉన్నత విద్యకు విద్యాదీవెన ఊతం

- కళాశాల ఫీజులు నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ
- జిల్లాలో 40,740 మందికి రూ.30.45 కోట్లు విడుదల
- జేసీ రోణంకి కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన పథకం విద్యార్థుల ఉన్నత విద్యకు ఊతంగా నిలుస్తోందని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి జగనన్న విద్యాదీవెన నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో జమచేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి జాయింట్ కలెక్టర్, అధికారులు, విద్యార్థులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన కింద జిల్లాలోని 40,740 మంది విద్యార్థులకు సంబంధించి రూ.30.45 కోట్లను నేరుగా వారి తల్లుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు పిల్లలను ఉన్నత విద్య చదివించేందుకు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రభుత్వమే జగనన్న విద్యా దీవెన పథకం కింద ఫీజుల మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో జమచేసి ఆర్థిక భారం నుంచి ఉపశమనం కల్పిస్తోందని పేర్కొన్నారు. జగనన్న విద్యాదీవెనతో ప్రతి విద్యార్థికి ఉన్నత విద్య చదివే అవకాశం కలిగి బంగారు భవిష్యత్‌కు మార్గం సుగమమైందన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్, బీసీ, మైనార్టీ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు రమేష్, వెంకటయ్య, నిర్మలాదేవి, పరిమళ, తదితరులు పాల్గొన్నారు.

మా కుటుంబం ఆనందంగా ఉంది



మాది మధ్యతరగతి కుటుంబం. మా నాన్న రైతు. నేను జగన్స్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నా. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత మాకు ఫీజు కట్టే బాధ తప్పింది. జగనన్న విద్యాదీవెన కింద ప్రభుత్వం విడతల వారీగా నేరుగా ఖాతాలో జమ చేస్తున్న నగదును కళాశాలకు చెల్లిస్తున్నా. మా తమ్ముడికి అమ్మఒడి, నాన్నకు రైతు భరోసా, అమ్మకు పొదుపు రుణమాఫీ పథకాలు అందాయి. మా కుటుంబానికి అన్ని విధాలా మంచి చేస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు.

–పల్లాల ప్రసన్న, డిగ్రీ విద్యార్థిని, జగన్స్ కళాశాల, నెల్లూరు

మంచి ఉద్యోగం సాధిస్తా



నేను వివేకానంద కళాశాలలో బీసీఏ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నా. నా తమ్ముడు కూడా డిగ్రీ చదువుతున్నాడు. మా నాన్న డ్రైవర్. మా నాన్నకు ఇబ్బంది లేకుండా జగన్ సార్ వేస్తున్న విద్యాదీవెన నగదుతో మా కళాశాలల ఫీజులు చెల్లిస్తున్నాం. మాలాంటి వారికి జగనన్న విద్యాదీవెన పథకం ఎంతో ఉపయోగపడుతోంది.

–మహ్మద్‌అలీ, డిగ్రీ విద్యార్థి, వివేకానంద డిగ్రీ కళాశాల, నెల్లూరు

వెరీ గుడ్డు



ప్రజలు ఆహారంలో భాగంగా కోడిగుడ్డును తీసుకోవడం ఎక్కువైంది. కోడిగుడ్ల వినియోగం జిల్లాలో ఏడాదికేడాది పెరుగుతోంది. మాంసాహారులతోపాటు శాకాహారులు కూడా గుడ్డును ఇష్టంగా తీసుకుంటున్నారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం జిల్లాలో రోజుకు గుడ్ల వినియోగం దాదాపు 3.5 లక్షలుంటే నేడు 12.5 లక్షలకు చేరింది. అంటే వాటి వినియోగం ఇంచుమించు నాలుగు రెట్లు పెరిగింది.



జిల్లాలో..

పెంచుతున్న కోళ్ల సంఖ్య : 4 లక్షలు	రోజుకు కోడిగుడ్ల ఉత్పత్తి : 3.5 లక్షలు
పౌల్ట్రీ రైతుకు దక్కుతున్న రేటు : రూ.6.20	ఇతర రాష్ట్రాల నుంచి గుడ్ల దిగుమతి : 8.5 లక్షలు
	మార్కెట్‌లో రిటైల్‌గా గుడ్డు ధర: రూ.7.50

జిల్లాలో రోజుకు 12 లక్షల గుడ్ల వినియోగం

- ఇష్టంగా తింటున్న ప్రజలు
- ఆరోగ్యపరంగా మేలేనంటున్న వైద్యులు
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- రైతుకు ప్రస్తుతం గిట్టుబాటులో ధర

రిటైల్‌గా తక్కువ ధరలో..

నేడు ఏ హోటల్‌కో.. టీ స్టాల్‌లో వెళ్లి ఓ కప్పు టీ తాగితే కనీసం రూ.10 నుంచి రూ.25 వరకు చెల్లించాల్సి వస్తోంది. అదే రిటైల్‌గా ఒక కోడి గుడ్డు ధర రూ.7.50కు అందుబాటులో ఉంటోంది. టీలో కంటే గుడ్డులోనే పోషకాలు ఎక్కువన్న సంగతి అందరికీ తెలిసిందే. దీంతో గుడ్లను వినియోగించే వారు ఎక్కవయ్యారు.

సాక్షి, నెల్లూరు డెస్క్: గుడ్డు కల్తీలేని పదార్థం. నేడు మార్కెట్‌లో వినియోగదారులు ఏది కొనాలన్నా కల్తీల బెడద ఎక్కువగా ఉంది. బియ్యం, పాలు, కారం, పప్పులు, నూనెలు ఇలా దేనినీ వదలకుండా కొందరు వ్యాపారులు కల్తీమయం చేశారు. కూరగాయలు కొందామంటే వాటిలోనూ విషపూరిత రసాయన అవశేషాలు ఉంటున్నాయి. కల్తీ చేయలేని కొన్నింటిలో కోడి గుడ్డు ఉండటం కాస్త ఊరట కలిగించే విషయమే. కాబట్టే డాక్టర్లు కూడా రోజుకు ఒక గుడ్డును ఆహారంలో భాగంగా తీసుకోవాలని చెబుతుంటారు.

నేడు తక్కువ సంఖ్యలో ఫారాలు

జిల్లాలో పౌల్ట్రీ ఫారాలు రెండు దశాబ్దాల క్రితం వరకు పెద్ద సంఖ్యలో ఉండేవి. అయితే కాలక్రమంలో వాటిలో పెట్టుబడికి తగిన విధంగా లాభాలు లేక పోవడంతో చాలామంది తీసివేశారు. ప్రస్తుతం ఆరు నుంచి పది వరకు మాత్రమే ఉన్నాయి. ఒక్కో ఫారంలో కెపాసిటీని బట్టి కోళ్ల సంఖ్య వేల నుంచి లక్షల్లో ఉంటుంది. జిల్లాలో దాదాపు 4 లక్షల వరకు లేయర్ కోళ్లను రైతులు పెంచుతున్నారు. వాటి పెంపకం కూడా చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. కోళ్లకు ఆహారంగా మొక్కజొన్న, సోయాను ఎక్కువగా వినియోగిస్తున్నారు. సోయా రేటు కిలో రూ.52, మొక్కజొన్న కిలో రూ.26కు చేరింది. దాణా రేట్లు పెరిగిన మేరకు కోడిగుడ్డు రేటు పెరగడం లేదని పౌల్ట్రీ రైతులు వాపోతున్నారు.

రోజుకు 3.5 లక్షల గుడ్ల ఉత్పత్తి

జిల్లాలో కోడిగుడ్ల ఉత్పత్తి రోజుకు 3.5 లక్షల వరకు ఉంటోంది. అయితే గుడ్ల వినియోగం మాత్రం జిల్లాలో రోజుకు 12.5 లక్షల వరకు ఉంటోంది. దీంతో తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి కోడిగుడ్లను వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో రైతుకు హోల్‌సేల్‌గా ఒక్కో గుడ్డుకు రూ.6.20 వరకు అందుతోంది. ప్రస్తుతం ఉత్తర భారతదేశంలో చలి తీవ్రత ఎక్కువగా చేపల లభ్యత తక్కువగా ఉంటోంది. దీంతో గుడ్డును డిమాండ్ పెరిగి ఫాం వద్ద రైతుల నుంచి రూ.6.20లకు కొనుగోలు చేస్తున్నారు.

రక్తహీనత నివారిస్తుంది



రోజువారీ ఆహారంలో కోడి గుడ్డు కచ్చితంగా ఉండాలి. ఉడికించిన గుడ్డు తినడం మంచిది. అలా అని అతిగా గుడ్డును తినడం ఆరోగ్యానికి మంచిది కాదు. గుడ్డులో కొవ్వు శాతం అధికంగా ఉంటుందని, గుండెకు మంచిది కాదని అంటారు కానీ అందులో నిజం లేదు. వారానికి ఆరు గుడ్లు తినడం ద్వారా గుండె జబ్బులు తగ్గుతాయి. గుడ్లలో కూడా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి గుండె ఆరోగాన్ని కాపాడతాయి. గుడ్డులో ఉండే పోషకాలు ఎముకలు, కంటికి మేలు చేస్తాయి. గుడ్లలో పొటాషియం, కాల్షియం, ఐరన్‌లు ఉంటాయి. అందువల్ల రక్తహీనత సమస్య రాదు. చక్కెర వ్యాధిగ్రస్తులు గుడ్డులోని పసుపు పదార్థాన్ని తీసుకోకపోవడం మంచిది.

– పూజిత, డైటీషియన్, కిమ్స్ హాస్పిటల్

చిన్నారులకు రోజుకు ఒకటి మేలు



కోడిగుడ్డులో అనేక పోషకాలు లభిస్తాయి. చిన్నారులు రోజూ ఒకటి చొప్పున గుడ్డు తినవచ్చు. గుడ్లులో ఉండే పదార్థం సులభంగా జీర్ణమయ్యే రూపంలో ఉంటుంది. కనుక ఉడికించిన గుడ్డును చిన్నారులకు ఆరు నెలల వయసు నుంచే తినిపించవచ్చు. శరీరం ధృడంగా మారాలన్నా రోజూ కోడిగుడ్డు తీసుకోవాలి. గుడ్డులో పొటాషియం, కాల్షియం, ఐరన్‌లు ఉంటాయి. పచ్చసొనలో క్యాలరీలు, ప్రొటీన్, విటమిన్ బీ6, విటమిన్ కె పోషకాలు ఉంటాయి. సెలీనియం కూడా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది.

–పద్మజ, డైటీషియన్, నారాయణ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్

పోషకాలు ఏమిటంటే..

100 గ్రాముల బాయిల్డ్ గుడ్డు తీసుకుంటే 155 కేలరీల శక్తి అందుతుంది. ఇందులో కొవ్వు 11 గ్రాములు, సోడియం 12.4, పొటాషియం 12.6, ప్రొటీన్లు 13 గ్రాములుంటాయి. ఇంకా ఐరన్, కాల్షియం, విటమిన్ డీ కూడా ఉంటాయి.

భూసేకరణను వేగవంతం చేయాలి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో జాతీయ రహదారుల, పోర్టుల నిర్మాణానికి సంబంధించి భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన కార్యాలయంలో జాతీయ రహదారుల, రామాయపట్నం పోర్టు నిర్వాసితుల పునరావాసానికి భూసేకరణపై ఎన్‌హెచ్, ఆర్డీఓలు, మారిటైం బోర్డు అధికారులతో సమీక్ష నిర్వహించారు. బద్వేల్-నెల్లూరు రహదారికి సంబంధించి పేద రైతులకు నిబంధనల ప్రకారం ధర పెంచి అందించేందుకు సహకరించాలన్నారు. కృష్ణపట్నం పోర్టు రహదారి కోసం భూసేకరణ, పరిహారం పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రామాయపట్నం పోర్టు నిర్వాసితుల పునరావాసం కోసం భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి, నెల్లూరు, ఆత్మకూరు ఆర్డీఓలు మలోల, మధులత, మారిటైం బోర్డు అధికారులు ఐవీరెడ్డి, పద్మావతి, ఎన్‌హెచ్ఏఐ పీడీ గోయల్, తదితరులు పాల్గొన్నారు.

నిఘా పెంచి నేరాలను కట్టడిచేసి

- గతేడాదితో పోలిస్తే నేరాలు తగ్గుముఖం
- భేషుగ్గా జిల్లా పోలీస్ వ్యవస్థ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ.. శాంతి భద్రతల పరిరక్షణ, కేసుల ఛేదనలో జిల్లా పోలీసు యంత్రాంగం పురోగతి సాధించింది. ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ప్రజా భాగస్వామ్యంతో నేరస్తులపై కొరడా ఝుళిపించారు. యువత మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసకాకుండా వాటి వినియోగం వల్ల కలిగే నష్టాలపై 180 కళాశాలలు, 87 పాఠశాలలు, 350 ఇతర ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మొత్తం మీద ఎస్పీ చర్యలతో 2023 జిల్లాలో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఇదే స్ఫూర్తితో 2024లో సైతం జిల్లా వాసులకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తామని ఎస్పీ వెల్లడించారు.

48 హత్యలు

ఈ ఏడాది హత్యలు 48, హత్యాయత్నాలు 194, దొమ్మీలు 14, కొట్లాటలు 882, కిడ్నాప్‌లు 34, నమ్మకద్రోహం 330, నేరపూరిత ఉల్లంఘన 97, ప్రాపర్టీ నేరాలు 797, రోడ్డు ప్రమాదాలు 883, ఇతరత్రా నేరాలు 2,437 కేసులు నమోదయ్యాయి. మొత్తంమీద గతేడాది 10,394 కేసులు నమోదు కాగా ఈఏడాది 8,022 కేసులు నమోదయ్యాయి.

68.91 శాతం రికవరీ


ఈ ఏడాది 797 దొంగతనాల కేసులు నమోదయ్యాయి. రూ.7,94,61,541 సొత్తును దుండగులు అపహరించుకుని వెళ్లగా సాంకేతికతను వినియోగించి 503 కేసులను ఛేదించి రూ.5,47,63,650 చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. దీంతో రికవరీ శాతం 68.91గా ఉంది. నేర నియంత్రణలో భాగంగా ఈ ఏడాది 1308 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం సీసీటీవీల సంఖ్య 10,126కు చేరింది. సీసీ కెమెరాలను వినియోగించి అనేక కేసులను ఛేదించారు.

రోడ్డు ప్రమాదాలు

ఈ ఏడాది 883 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అందులో ఘోర రోడ్డు ప్రమాదాలు 388, ప్రాణాంతకం కాని రోడ్డు ప్రమాదాలు 495. మద్యం మత్తులో వాహనం నడుపుతున్న 11,773 మందితో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 16,246 మందిపై కేసులు నమోదు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 14 మందికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది.

సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనతో ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరుగుతోంది. ఈ ఏడాది 3,722 ఫిర్యాదులు రాగా 3,416 ఫిర్యాదులు (96శాతం) పరిష్కరించి బాధితులకు న్యాయం చేశారు. జగనన్నకు చెబుదాం (జేకేసీ) ద్వారా 1,081 ఫిర్యాదులు అందగా వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించారు.



అక్రమార్కులపై కఠిన చర్యలు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సహకారంతో ఇసుక అక్రమ రవాణాపై 316 కేసులు నమోదు చేసి 370 వాహనాలను సీజ్ చేసి 468 మందిని అరెస్ట్ చేశారు. క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించి మూడు కేసులు నమోదు చేసి 20 మందిని అరెస్ట్ చేసి 15 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్స్, రెండు ట్యాబ్‌లు, రూ.34,16,319ల నగదును స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమరవాణాపై 43 కేసులు నమోదు చేసి 239 మంది నిందితులను అరెస్ట్ చేసి 15 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పదేపదే నేరాలకు పాల్పడే పది మందిపై పీడీయాక్ట్ ప్రయోగించారు. 307 మందిపై రౌడీషీట్లు, 212 మందిపై సస్పెక్టెడ్ షీట్లు తెరిచారు.

ఎస్పీకి డీజీపీ డిస్క్ అవార్డు

శాంతిభద్రతల పరిరక్షణ, కన్విక్షన్ బెస్ట్ పోలీసింగ్ తదితర విభాగాల్లో ప్రతిష్టాత్మక డీజీపీ డిస్క్ అవార్డును ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

మెరుగైన శాంతిభద్రతలు అందిస్తాం

ప్రజలతో ఎంత స్నేహ పూర్వకంగా ఉంటున్నామో తప్పుచేస్తే అంతే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు.

మహిళల భద్రతకు పెద్దపీట

మహిళలకు సంబంధించి నేరాలు తగ్గుముఖం పట్టాయి. దిశా యాప్ ద్వారా మహిళలు తమకు జరిగిన అన్యాయాలపై నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 20,039 మంది యాప్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీంతో జిల్లాలో వినియోగదారుల సంఖ్య 8,04,764కు చేరి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. దిశా యాప్ ద్వారా ఈఏడాది 299 ఫిర్యాదుల్లో 26 ఫిర్యాదులపై కేసులు నమోదు చేశారు. పలు ఫిర్యాదుల్లో కౌన్సిలింగ్ చేసి కాపురాలను చక్కదిద్దారు. ఈఏడాది వరకట్న హత్యలు మూడు, వరకట్న మరణాలు ఆరు, ఆత్మహత్యకు ప్రేరణ 17, హత్యలు 16, లైంగికదాడి 13, కిడ్నాప్‌లు 12, బైగామి 2, వేధింపులపై 510 కేసులు నమోదయ్యాయి.

దాయాదుల వైరం ఘటనలో మరొకరి మృతి

- ఆలస్యంగా వెలుగులోకి



ఘటనా స్థలంలో శ్రీనివాసులురెడ్డి మృతదేహం

మర్రిపాడు : మండలంలోని భీమవరం పంచాయతీ వడ్డిపాళెంలో గురువారం జరిగిన దాయాదుల వివాదంలో మరొకరు మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పొలం విషయంలో రఘురామిరెడ్డి అనే వ్యక్తి వ్యవసాయ ట్రాక్టర్ కేజ్‌వీల్‌తో రామరత్నారెడ్డిని తొక్కించడంతో తీవ్రగాయాలై ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం విదితమే. ఈ ఘటనలో మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఈ ఘటనకు సంబంధించి మరో మృతదేహం శుక్రవారం లభ్యం కావడం కలకలం రేగింది. ఘటన జరిగిన 24 గంటల తరువాత అదే ట్రాక్టర్ కిందపడి మృతిచెందిన మూలి శ్రీనివాసులురెడ్డి(47) అనే వ్యక్తి మృతదేహం కనిపించింది. దీంతో సమాచారం అందుకున్న మర్రిపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేసి గాలించి ఉంటే అప్పుడే ఈ మృతదేహం కూడా లభ్యమయ్యేదని గ్రామస్తులు అంటున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

నెల్లూరు(పొగతోట) : ఉపాధి పనుల కల్పన, ఆధార్ సీడింగ్ తదితర విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ వెంకట్రావ్ మండల సిబ్బందిని హెచ్చరించారు. నగరంలోని డ్వామా కార్యాలయం నుంచి ఏపీడీలు, ఏపీఓలు, ఈసీలు, టీఏలతో శుక్రవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. ఉపాధి కూలీలకు సంబంధించి వంద శాతం ఆధార్ సీడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ఉపాధి హామీ పనుల కల్పనకు సంబంధించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం అభివృద్ధి చెందేలా పను లు కల్పించాలన్నారు.

క్లుప్తంగా

చీటింగ్ కేసులో మహిళకు ఏడాది జైలు

నెల్లూరు (లీగల్) : చీటింగ్ కేసులో నేరం రుజువు కావడంతో హైదరాబాద్‌లోని మదాపూర్‌కు చెందిన తలచిరు సురేఖకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5000 జరిమానా విధిస్తూ ఐదో అదనపు జుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జి.దేవిక శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన శ్రావణ్‌కుమార్‌కు అదే ప్రాంతానికి చెందిన జనార్దన్‌రావు ద్వారా సురేఖ పరిచయమైంది. కాగా ఆమెకు నెల్లూరులోని అంబాపురంలో 25 అంకణాల స్థలం ఉంది. దీనిని ఆమె వద్ద రూ.76 వేలకు శ్రావణ్‌కుమార్ జీపీఏ కమ్ సేల్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అయితే అదే ప్లాట్‌ను సత్యనారాయణ అనే వ్యక్తికి గతంలో విక్రయించిన విషయాన్ని సురేఖ దాచింది. కాగా ఆమె అదే ప్లాట్‌లో ఇల్లు నిర్మించుకుని తన తల్లిదండ్రులను ఉంచింది. దీంతో సురేఖపై శ్రావణ్ కుమార్ కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి పై మేరకు తీర్పు చెప్పారు.

కావలి రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ బదిలీ

నెల్లూరు(క్రైమ్) : కావలి రెండోపట్టణ ఇన్‌స్పెక్టర్ ఎ.సుధాకర్ గుంటూరు రేంజ్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రేంజ్ వీఆర్‌లో ఉన్న కొండవీటి శ్రీనివాసరావును నియమిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.18
పండ్లు	: రూ.6

సుపరిపాలనకు శాశ్వత భవనాలు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నూతన నుడా భవనానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల

నెల్లూరు(బారకాసు) : ప్రజలకు సుపరిపాలన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయం నుంచి జిల్లా కార్యాలయాల వరకు అన్ని శాఖలకు శాశ్వతంగా ప్రభుత్వ భవనాలు నిర్మిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని గాంధీనగర్‌లో రూ.6 కోట్లతో నిర్మించిన నుడా కార్యాలయ భవనాన్ని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్‌లతో కలిసి మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరుతో పాటు 8 నియోజకవర్గాల పరిధిలో సేవలందిస్తున్న నుడా కార్యాలయాన్ని విశాలంగా నిర్మించినట్లు తెలిపారు. ఎంపీ ఆదాల మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో నుడా కీలకపాత్ర పోషిస్తోందని, ఎక్కడా అక్రమ లేఅవుట్లు లేకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులివ్వాలని సూచించారు. నుడా చైర్మన్ ద్వారకానాథ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో నుడా నూతన భవన నిర్మాణాన్ని చేపట్టి ప్రారంభించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నెల్లూరు ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి పాల్గొన్నారు.

టికెట్ ఇవ్వకుంటే చంద్రబాబుపై సోమిరెడ్డి కేసు పెడతాడు

ఇప్పటికే నాలుగుసార్లు ఓడిపోయిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఈసారి టీడీపీ తరఫున ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోతే ఆ పార్టీ అధినేత చంద్రబాబుతో పాటు లోకేశ్, పవన్ కల్యాణ్‌పైన కూడా ఆయన కేసు పెడతాడని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఒక్కొక్కరికి ఒక్కో బలహీనత ఉన్నట్లే టీడీపీ నేత సోమిరెడ్డికి డబ్బు బలహీనత ఉందన్నారు. సైదాపురం మైనింగ్‌లో తనపాత్ర ఉందంటూ నెల్లూరులో చలో సైదాపురం అంటూ హడావుడి చేశారని, ఆ తరువాత మైనింగ్ వ్యాపారుల నుంచి ముడుపులు తీసుకుని మౌనం వహించాడన్నారు. పొదలకూరులో మైనింగ్ చేస్తున్న వారి నుంచి టన్నుకు రూ.2 వేలు అడిగాడని, వారు ఇవ్వలేదనే సోమిరెడ్డి ఆందోళన చేస్తున్నాడని తెలిపారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని సోమిరెడ్డికి మరోసారి బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

గుప్త నిధుల కోసమే దోపిడీ

- ఆరుగురి అరెస్ట్, 700 గ్రాముల బంగారు నగలు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్) : నగరంలో సంచలనం రేకెత్తించిన వృద్ధ దంపతులపై దాడి.. బంగారు ఆభరణాలు, నగదు దోపిడీ కేసును శుక్రవారం పోలీసులు ఛేదించారు. గుప్త నిధుల కోసం దోపిడీకి పాల్పడిన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రూ.42 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. నెల్లూరు పరమేశ్వరి అవెన్యూకు చెందిన కృష్ణ బంగారం లైన్ బిజినెస్, కామాటివీధికి చెందిన గోల్డ్ అప్రైజర్ సురేష్, శ్రీకాళహస్తికి చెందిన కారుడ్రైవర్ మునిరాజా స్నేహితులు. వీరు గత కొంతకాలంగా గుప్త నిధుల అన్వేషణలో ఉన్నారు. కృష్ణకు దేవిరెడ్డివారివీధిలోని కుదువ వ్యాపారి గేవ్‌చంద్‌తో పరిచయం ఉంది. పూజల తాలుకు నగదు కోసం దోపిడీకి స్కెచ్ వేశాడు. ఈనెల 13న రాత్రి కుదువ వ్యాపారి ఇంట్లోకి వెళ్లి వృద్ధ దంపతులపై దాడి చేసి రూ.15 వేల నగదు, 700 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకుని పరారయ్యారు.

కేసు నమోదు

బాధితుని ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సంతపేట ఇన్‌స్పెక్టర్ బి.కల్యాణరాజు తన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విభిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పలు సీసీఫుటేజ్‌లను పరిశీలించారు. సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించారు. పరారీలో ఉన్న వారి కోసం తమిళనాడు, తెలంగాణతో పాటు మనరాష్ట్రంలో గాలింపు చేపట్టి చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు సమీపంలో నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.42 లక్షల విలువచేసే 700 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ కళ్యాణరాజు, క్రైమ్ పార్టీ హెడ్‌కానిస్టేబుల్స్ నరసయ్య, శ్రీనివాసులు, కానిస్టేబుల్స్ గౌస్‌బాషా, రాజకిశోర్‌లను ఎస్పీ అభినందించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ నేతల దాడి



గాయపడిన ఓబుల్‌రెడ్డిని తీసుకెళ్తున్న సీఐ గిరిబాబు

ఉదయగిరి : వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డిపై టీడీపీ నేతలు శుక్రవారం పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో దాడిచేయగా ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు శుక్రవారం పార్టీ కార్యక్రమంలో భాగంగా శ్రీనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ నేత మన్నేటి వెంకటరెడ్డి అదే కాలనీలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ విష్ణు ఇంటి వద్దకు రామారావును తీసుకెళ్లారు. అక్కడ విష్ణుపై పలు ఆరోపణలు చేశారు. దీనిపై బొల్లినేని రామారావును విష్ణు నిలదీశారు. అక్కడే ఉన్న మన్నేటి వెంకటరెడ్డికి, విష్ణుకు మధ్య గొడవ జరగగా బొల్లినేని అక్కడి నుంచి వెళ్లిపోయారు. మధ్యాహ్నం పంచాయతీ బస్టాండ్‌లో బొల్లినేని రాకకోసం వెంకటరెడ్డితో పాటు టీడీపీ నేతలు ఎదురు చూస్తున్నారు. విష్ణు తమ సమీప బంధువైన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డికి ఉదయం జరిగిన విషయాన్ని చెప్పి తన వర్గీయులతో అక్కడకు రాగా ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. టీడీపీ నేతలు ఓబుల్‌రెడ్డిపై దాడిచేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను పంపించారు. కావలి డీఎస్పీ వెంకటరమణ శుక్రవారం రాత్రి ఇక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు.

అసిస్టెంట్ ఈఈకి మూడేళ్ల జైలు

నెల్లూరు (లీగల్) : లంచం తీసుకున్నాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో అప్పటి అసిస్టెంట్ ఇంజినీర్ ఉప్పుటూరి సీతారామయ్యకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సత్యవాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. అల్లూరు మండలం ఇందుపూరు గ్రామానికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ అల్లంపాటి నిరంజన్‌రెడ్డి సింగరాయకొండలో ఇరిగేషన్ పనులు చేశాడు. తనకు సంబంధించిన ఈఎండీ, ఇన్సూరెన్స్‌కు సంబంధించిన ఎంబుక్‌ను ఇవ్వాలని సింగరాయకొండ ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లగా కందుకూరుకు బదిలీ అయిన సీతారామయ్య తీసుకెళ్లాడని తెలిసింది. దీంతో ఆయన కందుకూరులో అసిస్టెంట్ ఈఈ సీతారామయ్యను కలిసి ఎంబుక్ ఇవ్వాలని అడగ్గా రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. చివరికి రూ.7,500లకు ఒప్పందం కుదిరింది. అయితే లంచం ఇవ్వడం ఇష్టం లేని కాంట్రాక్టర్ నిరంజన్‌రెడ్డి నెల్లూరు ఏసీబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2012 మార్చి 26న నిరంజన్‌రెడ్డి లంచం ఇస్తుండగా ఏసీబీ పోలీసులు సాక్ష్యాధారాలతో సీతారామయ్యను అరెస్టు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై మేరకు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ త్రివేణి వాదించారు.

సాక్షి క్లాసిఫైడ్స్